ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
గురువారం 29 ఆగస్టు 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 27.0
తణుకు : 34.0 - 26.0

మైనర్ ఇరిగేషన్ సాగునీటి చెరువు



సాగునీటి సంఘాలకు పునరుజ్జీవం

సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వ్యవసాయ ప్రాధాన్యత సంతరించుకున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సాగునీటి సంఘాలు పునరుజ్జీవం పోసుకోనున్నాయి. ఐదేళ్లుగా జగన్ సర్కార్ సాగునీటి సంఘాల ఎన్నికల ఊసే ఎత్తలేదు. దీంతో ఈ కాలంలో నిధుల మాట ఎలా ఉన్నా సాగునీటిపై యాజమాన్య నిర్వహణ లేకపోవడంతో వాటి గురించి ఆలోచించే నాథుడే కరువయ్యారు

- సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు
- కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- కాలువలు, ప్రాజెక్టుల నిర్వహణలో రైతుల పాత్రే కీలకం
- పూర్వ వైభవమే దిశగా సాగు నీటి సంఘాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 28: వ్యవసాయ రంగంలో అత్యంత కీలకమైన సాగు నీటి సంఘాలను టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా బలోపేతం చేసింది. రైతులు ఎన్నుకునే ఈ సంఘాల ప్రతినిధుల ద్వారా నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా అమలయ్యేలా జాగ్రత్తలు పడింది. రైతులు ఉమ్మడిగా ఏ సమస్య వచ్చినా ఈ సంఘాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునే వారు. వాటర్ యూజర్స్ అసోసియేషన్(డబ్ల్యుయూఏ) పేరిట గోదావరి డెల్టాలో కాలువలకు ఏటా మరమ్మతులు నిర్వహించేవారు. ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుని కీలక బాధ్యతలను నిర్వర్తించేవారు. ఇప్పటి వరకు వున్న స్థితిగతులను బేరీజు వేసుకుని రైతులకు ప్రయోజనార్థకంగా ఉండే చర్యలు తీసుకునేవారు. ఈ తరహా పనులన్నింటికీ స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారుల చేయూత లభించేది. గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ విభాగానికి ఛైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత నరసాపురానికి చెందిన పాతూరి రామరాజు వ్యవహరించారు. ఆయన హయాంలో డెల్టా ఆధునికీకరణతోపాటు కాలువల నిర్వహణ పనుల్లో చురుకుదనం కనిపించేది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు అదృశ్యమయ్యాయి. అసలు ఇరిగేషన్ వ్యవహారాల్లో వీరి పాత్ర లేకుండా చేశారు. కాలువల నిర్వహణకు లస్కర్లు లేకపోయినా కాలువ లాకుల మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం రైతుల పక్షాన ఈ కమిటీలే ప్రభుత్వంపై ఒత్తిడి చేసి నిధులు రప్పించేవి. రెండో పంట సమయంలో నీటి సరఫరా నిర్వహణలోను కీలకంగా వ్యవహరించేవి.

సాగునీటి సంఘాల లేక అస్తవ్యస్తం..

వైసీపీ పాలనలో సాగునీటి సంఘాలు లేక ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ నిర్వీర్యం అయిపోయాయి. ఆ ప్రాజెక్టులకు జగన్ సర్కార్ అధికారులను నియమించి చేతులు దులుపుకుంది. దీంతో ఆ సంఘాల సమస్యలపై దృష్టిసారించే నాథుడే కరువయ్యారు. ఏదైనా వరదలు, ఇబ్బంది తలెత్తితే వాటిపై ఆరాతీసి నిలదీసేవారు లేకుండాపోయారు. సాగునీటి సంఘాల పర్యవేక్షణలో (వీఆర్‌వోలు) నీటితీరువా వసూలు చేసి ఆయా సంఘాల పరిధిలో నీటి వనరుల నిర్వహణకు ప్రభుత్వ నిధులు కొంత వెచ్చించి ఖర్చుచేసేవారు. కానీ నీటితీరువా వసూలు చేయడమే నిలిచిపోయింది. ఇంక నిర్వహణ ఎవరు చూస్తారు అని రైతులే బాహాటంగా విమర్శించేవారు. పంట కాలువల వద్ద నీటితీరువా వసూలు మాత్రమే జరిగేది.

రైతుల్లో హర్షం

సాగు నీటి సంఘాలకు ఎన్నికల నిర్ణయంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. చాలా కాలంగా ఎన్నికలు లేకుండా గాలికి వదిలేయడం, కాలువల నిర్వహణ పట్టించుకోని కారణంగా తాము ఎంత నష్టపోయామో చెప్పనలవి కాని పరిస్థితులు ఉన్నాయని, వీటిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం చొరవ చూపడం అందరికీ సమ్మతమేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు లేక ఇప్పటికే కాలువలు చాలా చోట్ల పూడుకుపోయాయి. మరికొన్నిచోట్ల లాకుల షెట్టర్లు దెబ్బతిన్నాయి. వీటి నిర్వహణకు వీలుగా నయా పైసా కూడా చెల్లించకపోవడం, తద్వారా రైతులకు సరైన సమయంలో సాగు నీరందని పరిస్థితి ఐదేళ్లుగా చవిచూశామని రైతులు చెబుతున్నారు. పార్టీలకతీతంగా ఆయా సంఘాలకు ఎన్నికలు జరగనుండగా వీటిలో అత్యధిక భాగం ఏకగ్రీవం అయ్యేలా ఎమ్మెల్యేలకు బాధ్యత అప్పగించబోతున్నారు.

జిల్లాలో నీటి సంఘాలు ఇలా..

గోదావరి వెస్ట్రన్ డివిజన్‌లో 131 సాగునీటి సంఘాలు ఉండగా 1 ప్రాజెక్టు కమిటీ ఉంది. వాటికి తోడు మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 222 నీటి సంఘాలు ఏర్పాటుచేయాల్సి ఉంది. ఇంకా జిల్లాలో తమ్మిలేరు. ఎర్రకాలువ నీటి ప్రాజెక్టులు కొలువు తీరాలి... సాగునీటి వినియోగదారుల సంఘాలు నీటిపారుదల శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ) పర్యవేక్షణలో, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉండగా, ప్రాజెక్టు కమిటీలు మాత్రం సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) పర్యవేక్షణలో నిర్వహిస్తారు.

నీటి సంఘాలతోనే సమస్యలకు పరిష్కారం

గంగరాజు, కోతిగుంట నీటి సంఘ మాజీ అధ్యక్షుడు, మాధవరం



గతంలో సాగునీటి సంఘాల నిర్వహణతోనే రైతుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లేవాళ్లం. కానీ ఈ ఐదేళ్ల మా సమస్యలు పట్టించుకున్నవారే లేరు. మా మాధవరంలో ఎర్రకాలువ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయాం. గతంలో గట్లకు పడిన గండ్లను కూడా పూడ్చలేదు.

భీమవరానికి ఎఫ్ఎం రేడియో

భీమవరం టౌన్, ఆగస్టు 28 : భీమవరం పట్టణానికి మరో ఎఫ్ఎం రేడియో ఏర్పాటుకు అవకాశం వచ్చింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 253 పట్టణాలలో ఎఫ్ఎం రేడియోల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అందులో భీమవరం పట్టణానికి మరో ఎఫ్ఎం రేడియో ఏర్పాటుకు అనుమతి లభించింది. ఇప్పటికే విష్ణు విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఎఫ్ఎం రేడియో గత కొన్ని సంవత్సరాలుగా సేవలందిస్తోంది. కొత్తగా రానున్న ఎఫ్ఎం సేవలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పాటదారుల కుమ్మక్కు!

- మాధవాయిపాలెం రేవు పాట రూ.2.98 కోట్లకు ఖరారు

నరసాపురం, ఆగస్టు 28 : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నడుమ అత్యంత కీలక మైన మాధవాయిపాలెం-సఖినేటిపల్లి ఫెర్రీ రేవు పాటలో పాటదారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాటదారులు వ్యూహాత్మకంగా వ్యవహరించి వారంతా ఒక్కటై హెచ్చు మొత్తంలో పాట వెళ్లకుండా పెద్యాళ్లు, బహిరంగ వేలంలో పాల్గొన్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రభుత్వాదాయానికి గండి పడిందని చెబుతున్నారు. చివరకు రెండు కోట్ల 98 లక్షల ఎనిమిది రూపాయలకు యలమంచిలి మండలం కనకా యలంకకు చెందిన ది కనకదుర్గ శాండ్ అండ్ క్వారీ కో-ఆపరేటివ్ సొసైటీ పాటను దక్కించుకున్నది. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోని అధ్యక్షతన రేవు పాట నిర్వహించారు. పర్యవేక్షణ అధికారిగా డిప్యూటి సీఈవో నిర్మలజ్యోతి హాజరయ్యారు. నలుగురు మాత్రమే ఈఎంఐ కట్టి పాటలో పాల్గొన్నారు. ముందు బహిరంగ వేలం నిర్వహించారు. పాట ప్రారంభ ధర రూ.2.97 కోట్ల నుంచి ప్రారంభించారు. ముందుగా బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇందులో అమరేశ్వర శాండ్ క్వారీ సొసైటీ రూ.2,97,88,717 పాడింది. ఆ తరువాత సీక్రెట్ టెండర్లు తెరిచారు. అందులో నలుగురు పాటదారుల్లో ముగ్గురు మాత్రమే టెండర్లు వేశారు. బహిరంగ వేలం కంటే షెడ్యూల్‌లో వేసిన మొత్తం ఎక్కువగా ఉండటంతో ది కనకదుర్గా సొసైటీకి రేవు పాటను అధికారులు ఖరారు చేశారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి మార్చి 31 వరకు రేవు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.



గునుపూడిలో హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ బ్రాహ్మణ సంఘం సభ్యులు, అర్చకులు

అర్చకుల ఆనందం

- వేతనం రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంపు

భీమవరం టౌన్, ఆగస్టు 28 : కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన వంద రోజులలోపే అర్చకులకు ఇచ్చిన హామీ అమలుకు శ్రీకారం చుట్టడంతో అర్చకుల్లో ఆనందం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో జీతాలు పెంచాలని ఎన్నిసార్లు కోరినా ఫలితంలేకుండాపోయింది. ఈనేపథ్యంలో ఎన్నికల సందర్భంలో చంద్రబాబును కలసి అర్చకుల పరిస్థితిని వివరించి ఆదుకోవాలని కోరగా వాటి అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంగళవారంనాడు దేవదాయ ధర్మదాయశాఖతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. అందులో దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15వేలకు పెంచాలని నిర్ణయించారు. అదే విధంగా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న దేవాలయాలకు దూపదీప నైవేద్యాలు (డీడీఎంఎస్)ఇచ్చే రూ.5వేల నుంచి రూ.10వేల పెంపుకు ఆదేశాలు జారీ చెయ్యటంతో అర్చకులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో 65 మంది అర్చకులకు మేలు

జిల్లాలో పలు దేవాలయాల్లో 65 మంది అర్చకులు 10 వేల రూపాయల జీతంతో పనిచేస్తున్నారు. వీరికి 15వేల రూపాయలు పెంపుదల చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పెంపు కుటుంబ పోషణకు కొంతమేర ఆదుకున్నట్లు అవుతుందని అంటున్నారు.

130 మందికి ప్రయోజనం

దూపదీప నైవేద్యం పథకంలో ప్రస్తుతం 130 మంది 5వేల రూపాయలు చొప్పున అందుకుంటున్నారు. దాదాపు 10 ఏళ్ళ నుంచి 5వేలరూపాయలే ఇస్తున్నారు. వీరికి 10వేల రూపాయలు పెంచుతున్నారు. అదే విధంగా నిరుద్యోగ వేదపండితులకు నిరుద్యోగభృతి కింద 3వేల రూపాయలు అందించాలనే నిర్ణయంపై కూడా హర్షం వ్యక్తం అవుతోంది.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

భీమవరం అర్బన్/పాలకొల్లు అర్బన్, ఆగస్టు 28: అర్చకుల వేతనం పెంచడం పట్ల గునుపూడి సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద బుధవారం బ్రాహ్మణలు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ధన్యావాదాలు తెలిపారు. బ్రాహ్మణ సాధికార సమితి నర్సాపురం పార్లమెంటు కన్వీనర్ సంతోష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మిర్తిపాటి గున్నేశ్వరరావు, బ్రాహ్మణ సమాఖ్య నాయకులు వేలూరి శ్రీధర్, వెంకట్రామయ్య శర్మ, సత్య ప్రసాద్, మైలవరపు మణికంఠ, కొండేపూడి మణికాంత్, మారేళ్ళ అఖిలేష్ పాల్గొన్నారు.

- పాలకొల్లులో శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద బ్రాహ్మణులు విలేకర్లతో మాట్లాడారు. కొందరు బ్రాహ్మణులను కించపరిచే వారిపై చర్యలకు చట్టం తీసుకురావాలని కోరారు. పురోహిత సంఘం అధ్యక్షుడు మద్దూరి సూరిబాబు, మాజీ అధ్యక్షుడు తనికెళ్ళ శ్రీనివాస్, గరిమెళ్ళ రాంబాబు, భమిడిపాటి పవన్, కోట అనిల్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

పందలపర్రు వద్ద ఇసుక కోసం బారులు తీరిన జనం



ఇసుక కష్టాలు

ఇసుక కష్టాలు మళ్ళీ మొదలయ్యాయి. వినియోగదారుడికి భారంగా మారింది. ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రకటించినప్పటికీ దళారులు రంగ ప్రవేశం చేయడంతో ఇసుక ఇంటికి చేరేటప్పటికీ వినియోగదారుడు భారీగా చెల్లించుకోవాల్సి వస్తున్నది. మరో పక్క ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెంచాలని లారీల యజమానులు ఆందోళన చేస్తున్నారు. పొరుగు జిల్లాల్లో మాదిరిగా ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

- ఉచిత ఇసుకనే.. దోపిడి ఘనం...
- మరలా దళారుల చేతుల్లోకి..
- ఉభయ గోదావరి జిల్లాల్లో కిరాయి తక్కువ
- ఆందోళనలో ట్రాన్స్‌పోర్టర్‌లు

Sl. No.	Distance	Tractor with Trailer (4-5 Tons)	6 TYRE Goods carriage (10 Tones)	10Tyre Goods carriage (18 T)
	Transportation Rates in Rupees per Ton per Km			
1	0-10 Kms	Rs 600 /-	Rs 1000 /-	Rs 1620 /-
2	11-20 Kms	Rs 1100 /-	Rs 1800 /-	Rs 2800 /-
3	21-30 Kms	Rs 1600 /-	Rs 2600 /-	Rs 4080 /-
4	31-40 Kms	Rs 2100 /-	Rs 3400 /-	Rs 5340 /-
5	Greater Than 41 Kms	Rs.30/- per Km	Rs.67/- per Km	Rs.116/-per Km

ప్రభుత్వం నిర్ణయించిన కిరాయి ధరలు

పాలకొల్లు, ఆగస్టు 28: ఇసుక వినియోగదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఐదు యూనిట్ల లారీ ఇసుక జిల్లాలోని ఆయా ప్రాంతాలను బట్టి గమ్యానికి చేరేటప్పటికి రూ.20 వేలు ఖర్చు అవుతున్నది. ఇసుక ఉచితమే అయినప్పటికి ఐదు యూనిట్లకు సుమారు రూ.5 వేలు ఖర్చు అవుతుండగా దూరాన్ని బట్టి తూర్పు, పశ్చిమ జిల్లా కలెక్టర్‌లు లారీ కిరాయిలను నిర్ణయించారు. అయితే ఈ ధరలు తమకు గిట్టుబాటు కావడం లేదంటూ లారీల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 35 కిలోమీటర్ల దూరానికి ఐదు యూనిట్ల ఇసుక లారీకి కిరాయి రూ. 7,500 ఇస్తుండగా ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో 40 కిలోమీటర్ల దూరానికి రూ.5,300 ఇస్తున్నారని టిప్పర్ లారీల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకే రాష్ట్రంలో వ్యత్యాసం ఏమిటని టిప్పర్‌లారీ యజమానులు అంటున్నారు. ఇక ఇసుక కొనుగోలుదారులకు అడుగడుగునా కష్టాలే కనిపిస్తున్నాయి. పెండ్యాల, పందలపర్రు స్టాక్ పాయింట్‌లలో మాత్రమే ఇసుక అందుబాటులో ఉన్నది. ఉదాహరణకు పాలకొల్లులో ఒక భవనం నిర్మించుకునే వ్యక్తి ఇసుక బుక్ చేసుకోవాలంటే ఆయా స్టాక్ పాయంట్‌ల వద్దకు వెళ్లి ఇసుక బుక్ చేసుకోవాలి. అనంతరం రెండవ రోజు వాహనాలు ఏర్పాటు చేసుకోవాలి. ఈ విధానంతో దళారుల పాత్ర మరలా తెరపైకి వచ్చింది. ఇసుక కొనుగోలుదారులకు తమ ప్రాంతాల్లోని మీ సేవ కేంద్రాల్లోనే ఇసుక బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తే దళారుల పాత్ర తగ్గుతుంది. ఉదాహరణకు నరసాపురం ప్రాంతంలో ఇసుక కావాల్సిన వ్యక్తులు పెండ్యాల లేదా పందలపర్రు వెళ్లాలంటే 50 కిలోమీటర్లు పైబడి వెళ్లాల్సి ఉంటుంది. అక్కడకు వెళ్ళి ఇసుక బుకింగ్ కేంద్రాల్లో గంటలు తరబడి వీక్షించి మరలా మరో రోజు ఇసుక తెచ్చుకోవడానికి వెళ్ళవలసిన పరిస్థితి ఉంది. ఈ విధానాన్ని ఆసరాగా తీసుకున్న బ్రోకర్లు తామే ఆధార్‌కార్డులు ద్వారా ఇసుకను బుక్ చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు జరుపుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు అమలు అయితే ఇసుక కొనుగోలు కిరాయి మొత్తం కలిపినా ఐదు యూనిట్ల ఇసుక ధర రూ.10 వేలు లోపు ఉంటుంది. అయితే ఇపుడు వినియోగదారులు చేతికి ఇసుక వచ్చేసరికి ఐదు యూనిట్లు రూ. 20 వేలు పైబడి చెల్లించాల్సివస్తుంది.

ఇసుక పాలసీ సరళతరం చేయాలి

స్టాక్ పాయింట్‌లలో ఇసుక బుక్ చేసుకునే విధానాలకు స్వస్తి పలికి వినియోగదారుడు ఏ ప్రాంతంలో ఉంటే అక్కడికి సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో ఇసుక బుక్ చేసుకునే విధంగా రూపకల్పన చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. స్టాక్‌పాయింట్‌ల వద్ద ఇసుక బుక్ చేసుకోవడానికి వెళితే ఐదు గంటలు నిరీక్షించాల్సి ఉంటుందని వినియోగదారులు వాపోతున్నారు. ఉచిత ఇసుక విధానానికి పేరు రావాలన్నా ప్రభుత్వ ప్రతిష్ఠ పెరగాలన్నా ఉచిత ఇసుక రూపల్పన పారదర్శకంగా ఉండాలని పరిశీలకులు సూచిస్తున్నారు.

లారీ కిరాయిలు పెంచాలి

ఉమ్మడి పశ్చిమలో టిప్పర్‌లారీ అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి రాజా

ఒకే రాష్ట్రంలో జిల్లాల వారిగా లారీ కిరాయిలు నిర్ణయించడం అన్యాయం. ఇపుడు ఇస్తున్న కిరాయి డీజిల్ కొనుగోలుకే సరిపోతుంది. ఇదే విధానం కొనసాగితే లారీలకు కిరాయిలు గిట్టలేని పరిస్థితి వస్తుంది. ప్రభుత్వం దృష్టి పెట్టి అన్ని జిల్లాల్లోనూ టిప్పర్ లారీలు కిరాయిలు ఒకే విధంగా ఉండేటట్లు చూడాలి



కౌన్సిల్ సమావేశం.. (ఇన్‌సెట్‌లో) ఛైర్‌పర్సన్ వెంకట రమణ

రూ.18లక్షల ఖర్చు

ఎవరు భరిస్తారు?


- అన్న క్యాంటీన్ ఖర్చుపై కౌన్సిల్‌లో చర్చ
- గరంగరంగా కౌన్సిల్ సమావేశం

నరసాపురం టౌన్, ఆగస్టు 28: పట్టణంలోని స్టీమర్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్ ఖర్చుపై ఇండిపెండెంట్ కౌన్సిలర్ కోటిపల్లి సురేశ్ నిలదీశారు. గత టీడీపీ హయాంలో దాదాపు రూ.25లక్షలు వెచ్చించి అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం దాన్ని పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. మళ్లీ ఇప్పుడు అన్న క్యాంటీన్‌గా మార్చడానికి రూ.18లక్షలు వెచ్చించారు. ఈఖర్చు మునిసిపాలిటీకి భారం కాదా అంటూ సురేశ్ మండిపడ్డారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఛైర్‌పర్సన్ వెంకటరమణ ఆధ్వర్యన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రస్తుతం టౌన్ పోలీస్‌స్టేషన్ మునిసిపాలిటీదని, ఆ భవనానికి ఎందుకు అద్దె వసూలు చేయడం లేదంటూ ప్రశ్నించారు. అప్రూవల్ లేఅవుట్లలో పురపాలకానికి కేటాయించిన స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని 26వ వార్డు కౌన్సిలర్ జిల్లేళ్ళ దిలీప్ కోరారు. పట్టణంలో కేబుల్ విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వర్షాలకు, గాలులకు తెగి రోడ్డుపై పడుతున్నా అధికారులు స్పందించడం లేదంటూ కౌన్సిలర్ గంగరాజు మండిపడ్డారు. వీసీ కొత్తపల్లి నాని మాట్లాడుతూ డ్రెయినేజీ అధ్వానంగా ఉందని, కనీసం సిల్ట్ తొలగించడం లేదని మండిపడ్డారు. అడిదెల శ్యామల మాట్లాడుతూ తన వార్డులో సీసీ రహదారి వేయాలని, పతివాడ పద్మ వార్డులో డ్రెయినేజీ, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, బొమ్మిడి సూర్యకుమారి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, దిలీప్ రోడ్లపై పందులు, ఆవులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చారు.

నేడు యూత్ ఫెస్టివల్

భీమవరం టౌన్, ఆగస్టు 28 : యువతకు హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని జిల్లా లెప్రసీ, టీడీ అధికారి డాక్టర్ బి.భాను నాయక్ తెలిపారు. 9,10 తరగతి విద్యార్థులకు ఉదయం 11 గంటలకు మోటుపల్లివారి వీధిలో ఉన్న ఐఎంఏ హాల్‌లో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రథమ బహుతికి కింద రూ.7వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.4వేలు అందిస్తామన్నారు. డిగ్రీ విద్యార్థులు, ట్రాన్స్ జెండర్స్‌కు 31న మారథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఉదయం 6-30 గంటలకు భీమవరంలోని ఏరియా హస్పటల్ నుంచి ప్రకాశంచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనే విద్యార్థులు 91771 031 80, 99123 41474 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

తాటాకిల్లు దగ్ధం



ఆచంట, ఆగస్టు 28 : కరుగోరుమిల్లి సచివాలయ సమీపంలో గ్రామానికి చెందిన కటారి ఏడుకొండలు తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు కొబ్బరి దింపు ఒలుపు కార్మికుడిగా జీవిస్తున్నాడు. ఇంటిలోని సామగ్రి, బట్టలు, బ్యాంక్ పుస్తకాలు, అన్ని వస్తువులు అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబం రోడ్డున పడింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఏడుకొండలు భార్య ఇటీవలే ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళింది. వీరికి ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఆ సమయంలో వీరు స్కూలుకు వెళ్లగా.. ఏడుకొండలు వంట చేసి బయటకు వెళ్లాడు. డ్వాక్రాకు చెల్లించేందుకు ఇటీవల భార్య పంపించిన రూ. 9 వేలు పూర్తిగా కాలిపోవడంతో బాధితుడు, చిన్నారులు రోదిస్తున్న దృశ్యాలు పలువురిని కంట తడి తెప్పించాయి.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అస్వస్థత

అపారిశుధ్యమా.. సక్రమంగా ఉడకని ఆహారమా..

నూజివీడు టౌన్, ఆగస్టు 28 : నూజివీడు ట్రిపుల్ ఐటీలో అసలు ఏం జరుగుతోంది. రోజుకో వివాదంతో విద్యా సంస్థ ప్రతిష్ఠ మసకబారుతోంది. యాజమాన్యం తమ విధులు నిర్వర్తించడంలో తీవ్ర నిర్లక్ష్య వైఖరి కారణంగా విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరికలు జారీ చేసినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. తాజాగా క్యాంపస్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు విష జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధితులుగా మారారు. మూడు రోజులుగా రోజుకు 200 మంది అవుట్ పేషెంట్స్‌గా చికిత్స పొందుతున్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ మధ్యలో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అంతర్భాగంగా నడుస్తున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 300 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడి ఇంటిబాట పట్టారు. దీనిని గుర్తించి ఇక్కడ తగు జాగ్రత్తలు తీసుకోవడంలో యాజమాన్యం విఫలమైంది. క్యాంపస్‌లో జ్వర బాధితుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. మెస్‌ల్లో కొన్నిచోట్ల పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఫుడ్ కంటామినేషన్ అయ్యి పలువురు విద్యార్థులు కడుపు నొప్పి వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉడికీ ఉడకని పప్పు, నీళ్ల చారు, బంగాళా దుంప కూర ఇదే తమకు ఆహారంగా పెడుతున్నారని, మెస్‌లలో పారిశుధ్య నిర్వహణ ఘోరంగా ఉంటున్నదని విద్యార్థులు వాపోయారు. మూడు రోజుల క్రితం మెస్‌లతో ఇడ్లీ తిన్న విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారంటూ చెబుతున్నారు.

ఈ దుస్థితికి కారణాలేంటి ?

విద్యార్థుల దుస్థితికి అనేక కారణాలు ఉన్నాయి. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఉన్నత ఉద్యోగులు దాదాపు 99 శాతం కాంట్రాక్టు విధానంలో వచ్చిన వారే. చివరికి చాన్స్‌లర్, వైస్ చాన్స్‌లర్, డైరెక్టర్లు రెగ్యులర్ కాదు. గవర్నింగ్ కౌన్సిల్‌లోను వివిధ శాఖల అధికారులు వున్నా ఆర్జీయుకేటీ నిర్వహణలో వారి నిర్ణయాలు మొక్కుబడిగా ఉంటున్నాయి. మరోవైపు కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం చాన్స్‌లర్, వైస్ చాన్స్‌లర్, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం వాటికి ఆమోదం తెలుపలేదు. దీంతో తమ బాధ్యతల నిర్వహణపై వీరు శ్రద్ధ కనబర్చడం లేదు. మరోవైపు ఈ అధికారులందరూ వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన వారే. డైరెక్టర్ క్యాంపస్‌లో ఉండేది తక్కువ.. బయట విధులపై వెళ్లేది ఎక్కువని క్యాంపస్ ఉద్యోగులే వ్యాఖ్యానిస్తున్నారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు భోజన సదుపాయాలు అందించే మెస్‌లు టెండర్ల సమయంలో విద్యార్థికి రూ.87 కోట్ చేశారు. ఈ మొత్తానికి బ్రేక్‌పాస్ట్, భోజన సదుపాయాలు కల్పించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు.

మంత్రి లోకేశ్ ఆరా

నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల పరిస్థితిపై మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించారు. అనారోగ్య పరిస్థితులు ఏర్పడటానికి గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నత విద్య వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. దీంతో ఏలూరు డీఎంహెచ్‌వో షర్మిష్ఠ క్యాంపస్‌ను పరిశీలించారు. ఓపీ, ఇన్ పేషెంట్స్‌గా ఎంత మంది వైద్య సాయం పొందారు. వారి పరిస్థితి ఎలా ఉంది అనే అంశాలపై వైద్యాధికారిణి అంజలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్యం పాలవడానికి పారిశుధ్య లేమి ఒక కారణమన్నారు. నాణ్యతా ప్రమాణాలతో భోజనాన్ని అందించాలని ప్రధానంగా పాల ఉత్పత్తులు ఎంత పౌష్టికమో అంత త్వరగా కంటామినేషన్ అవుతాయన్నారు. మెస్‌లతో హైజనిక్‌గా భోజనం సదుపాయాలు అందించాలని ట్రిపుల్ ఐటీ ఏవో లక్ష్మణరావుకు సూచించారు



చికిత్స పొందుతున్న విద్యార్థులు



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పులిహోర ప్రసాదంలో పురుగు కలకలం

| 7




దేవస్థానం ఉట్టి కొడుతున్న యువకులు

రాజాధిరాజ వాహనంపై తిరువీధులకు పయనమైన శ్రీవారు, అమ్మవార్లు

శ్రీవారి సన్నిధిలో ఉట్ల సందడి

ద్వారకాతిరుమల, ఆగస్టు 28: రాజాధిరాజ వాహనంపై కొలువైన శ్రీవారు, అమ్మవార్ల ముందు యువకులు ఆనందోత్సాహాలతో ఉట్లను కొట్టి భక్తి భావాలను చాటుకున్నారు. శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని బుధవారం సాయంత్రం తిరువీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్ల వాహనం ముందు ఉట్టి కొడుతూ సందడి చేశారు. ఆలయ కల్యాణమండపం వద్ద ఉట్టిని కొట్టిన యువకులను ఆలయ అధికారులు సత్కరించారు.

క్షేత్రంలో భారీగా వివాహాలు, ఉపనయనాలు

సీజన్‌లో ఇదే ఆఖరి మహూర్తం..పెళ్లిళ్లకు మరోనెల బ్రేక్



ద్వారకాతిరుమల, ఆగస్టు 28: ఈ శ్రావణ మాసంలో ఆఖరి ముహూర్తం కావడంతో బుధవారం ఉదయం, రాత్రి చినవెంకన్న క్షేత్రంలో ఎన్నో జంటలు మాంగల్యబంధంతో ఒక్కటయ్యాయి. ఉప నయనాలు జరిగాయి. పెళ్లిబృందాలతో శ్రీవారి ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఆలయ అనివేటి మండపం, పాత కల్యాణమండప ప్రాంతంలో వందలాది పెళ్లిళ్లు జరిగాయి. మరోనెల రోజుల పాటు శుభకార్యాలకు బ్రేక్ పడనున్నది. వచ్చేనెల 4 నుంచి రానున్న భాద్రపద మాసం శూన్యమాసం. తిరిగి ఆశ్వీయుజం అనగా అక్టోబరు 5 నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభమవుతాయని పండితులు చెబుతున్నారు.

పవన్‌కల్యాణ్‌ను విమర్శించే అర్హత కొట్టుకు లేదు

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 28 : డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణకు లేదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కొట్టు పవన్‌కల్యాణ్ పై చేసిన వాఖ్యలను ఖండించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి కేవలం రెండు నెలలు గడిచిందని 60 రోజులుగా ప్రతీ నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం పైనే తామందరం పనిచేస్తున్నా మన్నారు. ఇప్పటికే గ్రామాల్లో తాగునీరు, రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టామ న్నారు. అవినీతి సొమ్ముకు అలవాటు పడిన మీకు 60 రోజులుగా ఆదాయం లేకపోయేసరికి ప్రజా సమస్యలు గుర్తుకువస్తున్నాయా అంటూ ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఇల్లు కట్టుకోవాలంటే సామాన్యులను సైతం వదల కుండా సొమ్ములు వసూలు చేసిన ఘనత మీకే దక్కుతుందన్నారు. కనీసం మీ కార్య కర్తలకు కప్పు టీ కూడా ఇవ్వని మీరు మా కార్యకర్తలపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మీరు పార్టీ మారతారన్న భావన మీ కార్యకర్తలలో ఉందని ముందు ఆ విషయం చూసుకోండంటూ విమర్శించారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

పోలవరం, ఆగస్టు 28 : పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 3,83,373 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 29.370 మీటర్లు, స్పిల్వే దిగువన 19.820 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఈఈ వెంకటరమణ తెలిపారు. ఎల్లండీపేట రిజర్వాయర్ నుంచి 120 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు రిజర్వాయర్ సిబ్బంది తెలిపారు.

ఆదర్శ దంపతుల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 28 : కులాంతర, మతాంతర వివాహ దంపతులకు 'అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారం-2024' ప్రోత్సహించిన తల్లితండ్రులకు గౌరవ సత్కారం చేసేందుకు తెలుగురాష్ట్రాల్లోని ఆదర్శ జంటల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన సూర్యసుద - సూర్యనారాయణ మాస్టర్ ఫౌండేషన్ ప్రతినిధులు స్మృతిసూర్యవంశీ, సూర్యతేజ సుబ్రాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 40 జంటలకు పురస్కారాలు అందజేస్తామని, ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని వివరించారు. ఆసక్తి వున్న కులాంతర, మతాంతర దంపతులు క్లోజప్ హాఫ్‌సైజ్, ఫుల్‌సైజ్ ఫోటో, దంపతుల, ఇరువురి తల్లితండ్రుల పేర్లు, మ్యారేజ్ డేట్, ఫోటోలు, సర్టిఫికెట్ వివరాలతో ఈ నెల 31లోగా వాట్సప్‌నెంబరు 96523 47207కు పంపాలని కోరారు. పురస్కారాలు సెప్టెంబరు 11న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రలో సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో అందజేస్తామన్నారు.

అర్చకులకు వేతనాల పెంపుపై హర్షం

ఏలూరు రూరల్, ఆగస్టు 28: అర్చకులకు వేతనాలు పెంచాలని నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, బ్రాహ్మణ సాధికారిత కమిటీ సభ్యులు సత్యవాడ దుర్గాప్రసాద్ హర్షం ప్రకటించారు. బుధవారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలకు రూ.10 వేలు వేతనం పొందే అర్చకులకు ఇక పైరూ.15 వేలు ఇవ్వడం పట్ల బ్రాహ్మణ్యం సంతోషం వ్యక్తం చేసిందన్నారు. యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మృతదేహ సమాచారం పోలీసులకు అందజేత

మృతుని గుర్తింపునకు ప్రత్యేక బృందం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఏలూరు క్రైం, ఆగస్టు 28 : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న గుర్తు తెలియని మృత దేహ సమాచారాన్ని ఎట్టకేలకు ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు ఆసుపత్రి సిబ్బంది బుధవారం మధ్యాహ్నానికి అందించారు. దీంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 20వ తేదీ ఉదయం ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం జంగారెడ్డిగూడెం రోడ్డులో జెఎంజె స్కూలు సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి (35)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని ఏలూరు ప్రభు త్వాసుపత్రిలో చేర్పించగా 22వ తేదీ ఉదయం మరణించాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు.ఈ సమాచారం ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు ఇవ్వడంలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. చివరకు బుధవారం మధ్యాహ్నానికి సమాచారాన్ని ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు ఇచ్చారు. దీంతో ఏలూరు రూరల్ పోలీసులు ఆ సంఘటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గుర్తించేందుకు, మృతికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ప్రత్యేక బృందా లను ఏర్పాటు చేశారు. మృతుడి వివరాలు తెలిస్తే ఏలూరు రూరల్ ఎస్ఐ సెల్‌నంబర్ 94407 96636 కు సమాచారం అందించాలని కోరారు.


అన్నీ ఉన్నా ఆదరణ ఏదీ ?

500 ఎకరాలు ఉన్నా ఆదాయం సున్నా

జమిందారుల ఏలుబడిలో అభివృద్ధికి దూరం

ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయ దుస్థితి

శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయం



నూజివీడు, ఆగస్టు 28: దిక్కులేని వారికి దేవుడే దిక్కు అంటారు. శోభనాచలవ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి పేరుకు సంపన్నుడే.. కాని అనాథ. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో ఈ క్షేత్రం దక్షిణసింహాచలంగా ప్రసిద్ధి చెందింది. సరైన ప్రచారం లేక నిర్వహణ లోపాలతో అభివృద్ధికి నోచుకోక కునారిల్లుతోంది. ఈ దేవాలయానికి నాడు జమిందారులు 500 ఎకరాలకు పైగా భూమిని నిత్య దూపదీప నైవేద్యాల కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఆ భూమి రైతులపరం అయింది. ఈ భూమి నుంచి ఒక్కరూపాయి కూడా ఇప్పటికి ఈ దేవాలయానికి ఆదాయంగా రావడం లేదు. స్వామి వెలసిన ఈ కొండ అంతా ఈ దేవాలయానికి చెందినదే. దిగువ ప్రాంతం చుట్టూ కొండను 500 కుటుంబాలు ఆక్రమించి భవనాలు సైతం నిర్మించుకున్నారు. వీటి నుంచి అద్దెరూపేణా ఒక్క పైసా కూడా దేవాలయానికి అందడం లేదు.

నవ నారసింహావతారాల్లో ఒకటి

నాలుగు వేల సంవత్సరాలు చరిత్ర కలిగిన శివకేశవులు కొలువు తీరిన పుణ్యక్షేత్రం ఇది. నరనవ నారసింహావతారాల్లో ఒక అవతారం వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి అవతారం.ఇక్కడ స్వామికొండపై స్వయంభూగా వెలిశారు. శుభవ్రతుడు అనే చంద్రవంశపు రాజు నరసింహుడు గురించి కొండపై తీవ్ర తపస్సు ఆచరించి స్వామి అనుగ్రహం పొంది ఈ కొండపై అమ్మవారితో కలిసి వెలవాలని కోరిన కోరిక మేరకు స్వామి ఇక్కడ స్వయంభూగా వెలిసినట్లు కథనం. మరో కథనం ప్రకారం శివకేశవులు లోక సంచారం చేస్తూ ప్రకృతి శోభతో విరాజిల్లుతున్న ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ముగ్ధులై ఇక్కడ కొండ అగ్రభాగాన శివుడు, కొండ మధ్య భాగాన లక్ష్మీనరసింహ అవతారంతో విష్ణువు వెలసినట్లు ప్రచారం. కాలానుగుణంగా ఈ దేవాలయం నూజివీడు జమిందారులైన మేకా వంశస్తులు వంశ పారంపర్య ధర్మకర్తలుగా ఉన్నారు. ఈ క్షేత్రం అగ్రభాగానికి వెళ్లేందుకు 750 మెట్లు ఎక్కాలి. 150వ మెట్టు వద్ద శేషయ్యపీఠం, కోదండ రామాలయం, 200వ మెట్టు వద్ద వేణుగోపాలస్వామి ఆలయం, 325 మెట్టు వద్ద వెంకటాచలస్వామి ఆలయం, 500 మెట్టు వద్ద శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ ఆలయాలు ఉన్నాయి. అగ్రభాగాన శివుడు, కొండ మల్లేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. శ్రీమహావిష్ణువు ఇక్కడ వరాహరూపంలో వరాహ పుష్కరిణిని సృష్టించారని ప్రతీతి. కొండ దిగువున ఈ పుష్కరిణి ఇప్పటికీ ఉంది.

హామీలు నీటిమూటలే

ఈ దేవాలయానికి వంశపారంపర్య ధర్మకర్త అయిన నూజివీడు మాజీ శాసనసభ్యుడు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా నూజివీడు నుంచి గెలిచారు. ప్రతి ఏటా జరిగే రథోత్సవంలో ఆయన ఈ గుడి అభివృద్ధికి హామీలు ఇచ్చేవారు. కాని అవేమీ కార్యరూపం దాల్చలేదు. ఆగిరిపల్లి కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేయిస్తానని అనేక పర్యాయాలు ధర్మకర్తగా, శాసనసభ్యుడిగా పలుమార్లు హామీలు ఇచ్చినా అవి అమలు కాలేదు. నూజివీడు మాజీ శాసనసభ్యుడు చిన్నం రామకోటయ్య ఘాట్ రోడ్డు నిర్మాణం చేయటానికి ప్రయత్నాలు చేయగా ఆలయ ధర్మకర్తలు మేమే అభివృద్ధి చేసుకుంటామని చెప్పడంతో ఆగిపోయింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పథకం రూపొందించింది. ఈ క్షేత్రానికి దగ్గరలో వెయ్యి ఎకరాలు విస్తీర్ణంలో బ్రహ్మలింగయ్య చెరువు ఉంది. ఈ చెరువు ఇటు నూజివీడు, అటు గన్నవరం నియోజకవర్గాలను కలుపుతూ ఉంటుంది. ఈ చెరువులో బోటింగ్, పర్యాటక కేంద్రంగా రూపొందించటానికి నాడు అంచనాలు రూపొందించారు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్షేత్రానికి ఘాట్‌రోడ్డు వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభిస్తే దాతలు ముందుకు వచ్చేందుకు సిద్దంగా ఉన్నారు. 750 మెట్లు ఎక్కడానికి కష్టమైన భక్తుల కోసం కొండ దిగువున శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ప్రతిష్ట ఆలయాన్ని నిర్మించారు.

భక్తుల విశ్వాసానికి విఘాతం



ఉత్సవ విగ్రహ చోరీతో భక్తుల విస్మయం

ఆగిరిపల్లి, ఆగస్టు 28: చరిత్ర ప్రసిద్ధి కలిగిన ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహ చోరీ భక్తుల విశ్వాసానికి విఘాతం కలిగించినట్లు అయింది. స్వయంభువుగా వెలసిన ఎగువ సన్నిధి స్వామి వద్ద నైవేద్యం పెట్టి ఘంట కొడితేనే దిగువ సన్నిధిలోని స్వామివారికి నైవేద్యం పెడతారు. ఈ రెండు నివేదనల మధ్యకాలంలో చోరీ జరగటం, అది పట్టపగలు జరగటం భద్రతా లోపాన్ని ఎత్తిచూపుతోంది. ఈ ఆలయ పరిసరాల్లో ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని దేవస్థానం కార్యదర్శి పోలీస్‌శాఖకు పలుమార్లు తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాల వైర్లు, విద్యుత్ వైర్లుపూర్తిగా కత్తిరించి ఈ దొంగతనం చేసినట్లుగా తెలిసింది. పోలీసులను వివరణ అడగ్గా బుధవారం సాయంత్రం క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలు సేకరించిందని వివరాల్లో తెలియాల్సి ఉంద న్నారు. ఈ చోరీపై రెండుటీమ్‌లు విచారణ చేస్తున్నాయని ఏఎస్సై తవేరియా నాయక్ తెలిపారు.

క్షమించరానిది : మాదల శివరామ్‌ప్రసాద్,గ్రామస్థుడు



ఎండోమెంట్ నిర్వహణలో ఉన్న ఆలయంలో ఉత్సవ విగ్రహం చోరీ. క్షమించరాని విషయం. గంజాయికి అలవాటు పడిన ఆకతాయిలు ఇలాంటి నేరాలు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టిపెట్టాలి: కృష్ణకుమార్,గ్రామస్థుడు



దేవాలయాల భద్రతపట్ల ప్రభుత్వం దృష్టి పెట్టాలి గత ప్రభుత్వం దేవాలయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దేవాలయాల పరిరక్షణపై చర్యలు చేపట్టాలి.



అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

రుచికరమైన ఆహారం అందించాలి : జేసీ

తణుకు, ఆగస్టు 28 :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ల ద్వారా శుచికరమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తణుకు అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వారితో మాట్లాడుతూ పదార్థాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. రోజు మొత్తంలో 15 రూపాయలు ఖర్చు చేస్తే తినడానికి సరిపోతుందని, మా డబ్బులు ఆదా అవుతున్నాయని వివరించారు. క్యాంటీన్ లోపల, బయట పరిసరాలు ఎపుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాత్రలు శుభ్రంగా క్లీన్ చేయాలని లేనిపక్షంలో ఆహారం కలుషితం అయ్యి అనారోగ్యాలకు దారితీస్తుందన్నారు. తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, మున్సిపల్ ఇంజనీర్ కొవ్వూరి ఈశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఫిట్‌నెస్ కోసం సమయం కేటాయించాలి : కలెక్టర్

ఏలూరు రూరల్, ఆగస్టు 28:ప్రజలు తమ రోజువారి జీవితంలో శారీరక వ్యాయామం, క్రీడలను అభ్యాసం చేసి ఆరోగ్యంగా, ధృడంగా ఉండాలని, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు పురస్కరించుకుని వారం రోజుల పాటు నిర్వహిస్తున్న క్రీడోత్సవాల్లో భాగంగా బుధవారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. చురుకైన, ఆరోగ్యకరమైన జీవన శైలి, ఫిట్‌నెస్, ఆరోగ్యం కోసం ప్రతిరోజూ 30 నిమిషాలు కేటాయిస్తానని కుటుంబ సభ్యులు, స్నేహితులు ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండేలా ప్రోత్సహిస్తానని క్రీడాకారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్టేడియంలో పలు పోటీల్లో కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్డీవో ఎస్.ఎస్.కె ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, డీపీవో టి.శ్రీనివాస్ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తల్లి మందలించిందని కాల్వలోకి దూకేశాడు



పాలకోడేరు, ఆగస్టు 28: తల్లి మందలించిందని ఇంటి నుంచి చెప్పకుండా వెళ్ళిపోయిన పాలిటెక్నిక్ విద్యార్థి బుధవారం గొల్లవానితిప్పవద్ద యనమ దుర్రు డ్రైన్‌లో శవమై తేలాడు. గొరగనమూడి గ్రామంలోని పెదపేటకు చెందిన తులసి అవినాష్ (17) భీమవరంలోని ఒక కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఈనెల 26వ తేదీన తల్లి మందలించిందని అవినాష్ ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. కుటుంబసభ్యులు బంధువుల వద్ద స్నేహితుల ఇంటి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పాలకోడేరు పోలీసులకు అవినాష్ తండ్రి సతీష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈలోగానే బుధవారం గొల్లవానితిప్ప వద్ద యనమదుర్రు డ్రైన్‌లో మృతదేహం ఉందని తెలియడంతో అవినాష్ కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా శవమై తేలి ఉన్నాడు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి



కామవరపుకోట, ఆగస్టు 28 : కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పెంటపాటి ప్రసన్నలక్ష్మి (40) బుధవారం కొత్తూరు చెక్‌పోస్టు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ప్రసన్నలక్ష్మి భర్త రవికుమార్ కొండగూడెంలోని ప్రాథ మిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వీరు మారుతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై విధులకు బయలుదేరారు. కొత్తూరు చెక్‌పోస్టు సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి ఒక ట్రాక్టర్ స్పీడుగా వచ్చి ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ప్రసన్నలక్ష్మి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 28 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని వట్లూరు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బూసి రామ్ ప్రసాద్ (23) ఈనెల 27వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో మినీ బైపాస్‌పై మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో గ్రీన్‌సిటీ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒక ప్రవేటు ఆసుపత్రికి తరలించగా అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి దగ్గర పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.

ఏటీఎంలో అర్ధరాత్రి బాంబ్ స్క్వాడ్ తనిఖీ



ఏలూరు క్రైం, ఆగస్టు 28 : ఏలూరు పవర్‌పేటలోని ఒక ఏటీఎంలో సూట్‌కేస్ ఉండడంతో ఏటీఎంలో సొమ్ములు డ్రా చేయడానికి వెళ్ళి వారంతా హడలిపోయారు. ఆ సూట్ కేసులో ఏ ముందే తెలియక రకరాలుగా చెప్పుకున్నారు. ఈనెల 27వ తేదీ రాత్రి పవర్‌పేటలోని పంజాబ్‌నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో ఒక సూట్ కేసు ఉంది. రాత్రి 9 గంటల నుంచి ఈ సూట్‌కేసు అక్కడే ఉందని చెప్తున్నారు. చివరకు ఏటీఎం సెంటర్ సొమ్ములు డ్రా చేయడానికి వచ్చిన వారు ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని బాంబ్ స్క్వాడ్‌ను రప్పించారు. అర్ధరాత్రి సమయంలో తనిఖీలు నిర్వహించారు. చివరకు అలాంటిదేమీ తేల్చారు. బ్యాంక్ మేనేజర్‌ను పిలిపించడంతో ఆ సూట్‌కేసు తానే మర్చి పోయానంటూ బ్యాంకుకు సంబంధించిదని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మొగల్తూరు, ఆగస్టు 28: మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామానికి చెందిన యువకుడుపై ఫోక్సో కేసు నమోదైంది. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి 17 సంవత్సరాల బాలికను గర్భవతిని చేయడంపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ రాజేంద్ర తెలిపారు. బాలిక ఇటీవల అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తీసుకెళ్ళగా ఎనిమిదో నెల గర్భిణీగా వైద్యులు ధృవీకరించారు. ఈ విషయాన్ని బాలిక తల్లితండ్రులకు చెప్పడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

స్థలం కోసం కూతురిపై తండ్రి దాడి

గొడవ ఆపడానికి వచ్చిన మేనమామపై దాడి.. తీవ్ర గాయాలతో మృతి

కూతురు, అల్లుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రాణి



వివాద స్థలం



మృతిచెందిన మేనమామ కృష్ణ

భీమడోలు, ఆగస్టు 28 : ఇంటి స్థలం వివా దంలో కన్న కూతురుపై నాన్న, పెద నాన్న దాడిచేసిన సంఘటనలో మధ్యలో గొడవ ఆపేందుకు వచ్చిన బంధువు కత్తి పోట్లకు బలయ్యాడు. కూతురు, అల్లుడు గాయాల పాలయ్యారు. ఏలూరు జిల్లా భీమడోలు శివారు అర్జావారి గూడెంలో జరిగిన ఈ ఘటన ఉలిక్కిపడేలా చేసింది. భీమడోలు మండలం అర్జావారి గూడెంలో ఉండే తడపల వెంకటేశ్వరరావు, దుర్గారావు అన్న దమ్ములు. దుర్గారావు కుమార్తె పూజారాణికి ఆమె అమ్మమ్మ సుమారు 3 సెంట్ల ఇంటి స్థలాన్ని ఇచ్చింది. పూజారాణి తన భర్త మోజేష్‌తో కలిసి అమ్మమ్మ ఇచ్చిన స్థలంలో తాతాల్కికంగా నిర్మించుకున్న షెడ్‌లో కాపురం ఉంటున్నారు. అయితే దుర్గారావు తన అమ్మ ఆస్తి తనకే చెల్లుతుందంటూ కూతురు ఉంటున్న స్థలం వెనక్కు ఇచ్చేయాలని ఆరు నెలలుగా గొడవ చేస్తున్నాడు. ఇటీవల ఈ వివాదంపై కూతురు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు తండ్రి దుర్గారావును ఇది తప్పని హెచ్చరించారు. బుధవారం ఉదయం కూతురుపై గొడ్డలితో దాడి చేసేందుకు వెళ్లగా గొడవ ఆపేందుకు ఆమె మేన మామ చాబత్తుల కృష్ణ (50) మధ్యలోకి వెళ్ళగా దుర్గారావు అన్న వెంకటేశ్వరరావు వెనుక నుంచి వచ్చి కోత కత్తితో కృష్ణ మెడపై నరికాడు. అడ్డు వచ్చిన రాణి, భర్త మోజేష్‌లపై కూడా కత్తితో దాడి చేశాడు.ఈ ఘటనలో కృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. రాణి ఏలూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అల్లుడు మోజేష్ భుజంపై స్వల్ప గాయాలయ్యాయి. నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. భీమడోలు సీఐ రవి కుమార్‌తో పాటు క్లూస్ టీమ్ పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భీమడోలు జంక్షన్‌లో ఆందోళన

మృతి చెందిన కృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలంటూ భీమడోలు జంక్షన్‌లో అర్జావారిగూడెం ప్రజలు, మృతుడి బంధువులు కృష్ణ మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి రాస్తారోకో నిర్వహించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని, ఉన్నతాధికారులు వచ్చి హామీ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, భీమడోలు తహసీల్దార్ రమాదేవి, సీఐ రవికుమార్ తదితరులు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబానికి రక్షణ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.




పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు..పులిహోరలో కనిపించిన పురుగు

పులిహోర ప్రసాదంలో పురుగు కలకలం

ద్వారకాతిరుమల, ఆగస్టు 28: చినవెంకన్నను దర్శించుకున్న అనంతరం భక్తులు స్వామివారి ప్రసాదం ఆరగించేందుకు ప్రాధాన్యం ఇస్తారు. అందులో లడ్డూ తరువాత స్థానం పులిహోరదే.. భక్తులు పరమ పవిత్రంగా భావించే ప్రసాదాల్లో పురుగు కన్పించడం కలకలం రేపింది. మంగళవారం రాత్రి క్షేత్రానికి కుటుంబసమేతంగా వచ్చిన ఓ భక్తుడు దర్శనానంతరం ప్రసాదాలను కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి దానిని తినేందుకు ప్రయత్నించి అవాక్కయ్యాడు. పులిహోర ప్రసాదంలో పురుగు కనిపించడమే ఇందుకు కారణం. ఏలూరుకు చెందిన బలభద్ర రామయ్య తన భార్యతో కలసి మంగళవారం సాయంత్రం శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం ప్రసాదాల కౌంటర్‌లో లడ్డూ, పులిహోర, శర్కరపొంగలి కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లిన తరువాత పులిహోర తినేందుకు ప్యాకెట్ విప్పగా అందులో పురుగు కన్పించడంతో ఆందోళన చెందారు. ఈ విషయాన్ని ఆయన ఏలూరుకు చెందిన తన స్నేహితుడైన టీడీపీ రాష్ట్ర ట్రేడ్ వింగ్ ఉపాధ్యక్షుడు పైడేటి రఘుకు తెలియపర్చగా ఆయన వాట్సప్ ద్వారా ఈవో వేండ్ర త్రినాథరావుకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే బుధవారం ఉదయం ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు.

ప్రసాదాల రవాణాలో పడి ఉండొచ్చు

ఈ ఘటనపై ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు మాట్లాడుతూ ఏలూరు భక్తులు కొనుగోలు చేసిన ప్రసాదంలో పురుగు వచ్చినట్లు తనకు సమాచారం వచ్చిందని వెంటనే ప్రసాదాల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశామన్నారు. భక్తులకు విక్రయించే ప్రసాదాలను ట్రక్కు ఆటో ద్వారా కౌంటర్లకు తరలిస్తారని రవాణా చేసే సమయంలోనే చెట్లపై నుంచి ఈ పురుగు పడి ఉండవచ్చని వివరించారు. ముందుగా కాంట్రాక్టరుకు నోటీసు ఇచ్చామని అలాగే ఏఈవో, సూపరింటెండెంట్, ఇతర సిబ్బందిపై చర్యలకు ప్రతిపాదిస్తామన్నారు.



వరదల్లో కొట్టుకుపోతున్న వారిని కాపాడిన అల్లూరి నగరం వాసులను సన్మానించిన ఎస్పీ కిషోర్

ప్రాణదాతలకు జిల్లా ఎస్పీ సత్కారం

భవిష్యత్తులో ఉపయోగించడానికి 50 లైఫ్ జాకెట్లు అందజేత

ఏలూరు క్రైం/ వేలేరుపాడు ఆగస్టు 28 : గత నెలలో భారీ వర్షాలకు కొండవాగులు పొంగటంతో గోదావరిలో నీరు చేరి ప్రమాదస్థాయికి వచ్చింది. ఈ సమయంలో రాజమహేంద్రవరం నుంచి రుద్రమకోట గ్రామానికి కారులో వెళ్తున్న ఒక కుటుంబం మార్గమధ్యలో వేలేరుపాడు మండలం మేడిపల్లి పంచాయతీ అల్లూరి నగరం గ్రామం వద్దకు వచ్చేసరికి కొరిసిల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దాటే ప్రయత్నం చేయగా కారు చిక్కుబడిపోయింది. అల్లూరి నగర్ కోయమాధారం గ్రామ యువకులు ప్రాణాలకు తెగించి కారులో ఉన్న ఐదుగురు వ్యక్తులను కాపాడారు. ధైర్య సాహసాలు ప్రదర్శించిన అల్లూరి నగర్ యువకులను బుధవారం ఉదయం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి రప్పించారు. వీరిని జిల్లా ఎస్పీ కిషోర్ సన్మానించి శాలువాలతో సత్కరించి పది వేల రూపాయల నగదు బహుమతి అందించారు. ధైర్య సాహసాలు ప్రదర్శించిన కొంకిపాటి శివాజీ, చాపర్ల శ్రీనివాసరావు, మిడియం ధర్మయ్య, చిలుకూరి లక్ష్మణరావు, శ్రీను, ఎలుపల ప్రసాద్, కట్టి పాపారావు, సున్నం ప్రసాద్‌లను సన్మానించారు. ఎన్ఆర్‌కె ఫౌండేషన్ ఎండీ నూకల లక్ష్మణరావు, చందులు వీరందరినీ అభినందించి భవిష్యత్తులో ఉపయోగించుకోవాలని 50 లైఫ్ జాకెట్ (50 వేల రూపాయల విలువైన)లను ఎస్పీచేతుల మీదుగా అందించారు. కారు ప్రమాదంలో గడ్డం సాయికుమారి, జ్యోతి, జగదీష్‌కుమార్, కుందన్ కుమార్‌లను రక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావు, సాయి కుమారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సెప్టెంబరు ఒకటిలోగా ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 28 : శాసనమండలి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నిక నిర్వహణలో భాగంగా అర్హతలు గల టీచర్లందరూ సెప్టెంబరు ఒకటో తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకుని, ఫారం-19ని స్థానిక ఎంపీడీవోకు మూడో తేదీలోగా సమర్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఓ ప్రకటనలో కోరారు. అభ్యంతరాలను అక్టోబరు 30లోగా పరిష్కరించి, తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురిస్తామని వివరించారు. సందేహాలుంటే డీఈవోను సంప్రదించాలని సూచించారు.

కొండంగిలో యువకుడి అదృశ్యం

కువైట్ పంపుతానని సొమ్ము తీసుకున్న వ్యక్తి నిర్లక్ష్యం

ఒత్తిడికి గురై ఇంట్లోంచి వెళ్లిపోయాడన్న తల్లి

కలిదిండి, ఆగస్టు 28 : మండలంలోని కొండంగి గ్రామానికి చెందిన సున్న మోజేష్ (32) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని తండ్రి ఏసురత్నం ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మోజేష్ అదృశ్యమవ్వటానికి పాలకొల్లుకు చెందిన గల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి కారణమని తల్లి మరియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కువైట్ పంపిస్తానని మోజేష్‌తో సహా మరో 11 మంది నుంచి మోజేష్ ద్వారా రూ. 9 లక్షలు గల్లి శ్రీనివాసరావు వసూలు చేశాడని, నెలలు గడుస్తున్నా కువైట్‌కు పంపించకపోవటంతో బాధితులకు అనుమానం వచ్చి శ్రీనివాసరావుకి ఫోను చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవటం లేదని తెలిపింది. దీంతో 11 మంది బాధితులు మోజేష్‌ని నిలదీయడంతో ఒత్తిడికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడని, తన కుమారుడిని మోసం చేసిన గల్లి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని తల్లి మరియమ్మ కలిదిండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి


తణుకు తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

తణుకు/తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 28: సుమోటో కుల ధ్రువీకరణ పత్రాలు కుణ్ణంగా పరిశీలిం చాకే జారీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం తణుకు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమోటాగా జారీ చేస్తున్న కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన డేటాను పరిశీలించారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వారు ఏ కులమో, ఏ మతమో తెలుసుకుని పత్రాల జారీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. తణుకు మండలంలో 6,520 కుటుంబాలకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సి ఉండగా ఇప్పటికే 6,283 పత్రాలు జారీకి చర్యలు తీసుకున్నామన్నారు. తహసీల్దార్ అశోక్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తణుకులోని నిత్యావసర వస్తువుల గోదామును తనిఖీ చేశారు. 30వ తేదీ లోపుగా రేషన్ షాపులకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాడేపల్లిగూడెంలో బుధవారం సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీ పరిశీలనలో భాగంగా హౌసింగ్ బోర్డు, బోదిగట్టు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. గత ప్రభుత్వంలో వీఆర్‌వోలు విచారణ చేసి తిరస్కరించిన పత్రాలు పరిశీలించారు. తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఆర్ఐ ప్రభు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్ వితరణ


మూడు చక్రాల సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 28: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మూడు రోజులుగా మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయం వద్ద జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆయనకు గుంటూరుకు చెందిన దివ్యాంగురాలు మూడు చక్రాల సైకిల్ కావాలని వినతి పత్రం ఇవ్వడంతో ఎమ్మెల్యే తన సొంత సొమ్ముతో మూడు చక్రాల సైకిల్‌ను కొనుగోలు చేసి మంగళగిరి పార్టీ కార్యాలయం వద్ద జనసేన రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. దీంతో పలువురు ఎమ్మెల్యేను అభినందించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, వర్తనపల్లి కాశి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో డీఆర్జీ విద్యార్థుల ప్రతిభ

పెంటపాడు, ఆగస్టు 28: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కవితలు, కథల పోటీలలో పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. కవితల పోటీలలో విద్యార్థులు జి. పరిమళ, జి.స్వాతి, పి.సింధు, ఎం. దుర్గాదేవి, పి. దేవి, కథల పోటీలలో పి.సౌమ్య పి.సింధు, పి.వైష్ణవి నగదు బహుమతులు గెలుచుకున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుంకర గోపాల్, అధ్యాపకుడు పి.రామచంద్ర తదితరులు అభినందించారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

తణుకు, ఆగస్టు 28:జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని కేసులు రాజీ చేసుకోవాలని నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి డి.సత్యవతి అన్నారు. బుధవారం బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సివిల్, మోటారు వెహికల్, ప్రమాద, కుటుంబ తగాదా, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. కోర్టుల్లో పెండింగ్ కేసులు తగ్గించడానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. న్యాయాధికారులు కె.కృష్ణసత్యలత, పి.సాయిరాం, పీవీకే రంజిత్‌కుమార్, చిరంజీవిరావు, తాడి అంజనేయులు బార్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, రామకృష్ణ, కామన మునిస్వామి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిసలు కావద్దు

అత్తిలి, ఆగస్టు 28: యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు కోరారు. అత్తిలి డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయిని ఎవరైనా విక్రయిస్తే సమాచారం తెలపాలని కోరారు. సైబర్ నేరాలు జరిగితే 1930కి ఫోన్ చేయాలని కోరారు. అత్తిలి ఎస్ఐ పి.ప్రేమ్‌రాజు, కళాశాల కమిటీ ఛైర్మన్ దాసం గోవిందరావు, ప్రిన్సిపాల్ శర్మ, ఏఎస్ఐ ఎం.వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం సీఐ, ఎస్ఐలను సత్కరించారు.

చందు మృత దేహానికి నివాళులు


నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 28: ఖజకిస్థాన్‌లో గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందు మృతదేహానికి బుధవారం కూటమి నాయకులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, సర్పంచ్ పోతుల అన్నవరం తదితరులు చందు కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం స్వగ్రామంలోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

15వ తేదీ లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

పెంటపాడు, ఆగస్టు 28: రైతులందరూ సెప్టెంబరు 15వ తేదీలోగా ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల ఏవో పార్థసారథి తెలిపారు. పంట నమోదుతో పాటు రైతులు తమ బయోమెట్రిక్ కూడా గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు.

నేటి సమాచారం

ఆక్వా రైతులకు అవగాహన సదస్సు

మొగల్తూరు, ఆగస్టు 28 : మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆక్వా రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు మత్స్యశాఖ అధికారి కె.వివేక్ తెలిపారు. ఎంపెడా అధికారులు పలు సూచనలు, సలహాలు అందిస్తారని, ఆక్వా రైతులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాక్ బృందం పర్యటనను విజయవంతం చేయాలి

ఆకివీడు రూరల్ : దుంపగడపలోని వీవీ గిరి కళాశాలను నాక్ బృందం గురువారం పర్యటిస్తున్న సందర్భంగా విజయవంతం చేయాలని విద్యార్థి సంఘం అధ్యక్షుడు గొంట్ల కృష్ణమూర్తి కోరారు. బుధవారం కాలేజీలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు విచ్చేసి ముఖాముఖిలో కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నేడు మావుళ్లమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

భీమవరంటౌన్ : మావుళ్ళమ్మ అమ్మవారి హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కిస్తున్నట్టు దేవస్థానం ఈవో నగేష్ తెలిపారు. ఉదయం దేవదాయ, ధర్మదాయ అధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందన్నారు.

నేడు సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఎక్స్‌పర్ట్ టీమ్ విచారణ

ఆకివీడు : ఆకివీడు సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రికి గురువారం విచారణ నిమిత్తం ఎక్స్‌పర్ట్ టీమ్ వస్తున్నట్టు నిర్వాహకులు బుధవారం తెలిపారు. దుంపగడపకు చెందిన విద్యార్థి మరణంపై విచారణ అనంతరం విలేకర్లతో మాట్లాడం జరుగుతుందన్నారు.

అయి-భీమవరం రోడ్‌లో
ఆక్రమణల తొలగింపు

స్వచ్ఛందంగా తరలిన ఆక్రమణదారులు

మొహరించిన పోలీసులు.. సీపీఎం నేతల హౌస్ అరెస్ట్


అయి-భీమవరం రోడ్‌లో ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగింపు

తరలి వెళుతున్న ఆక్రమణదారులు

ఆకివీడు, ఆగస్టు 28 : పట్టణ పరిధిలోని అయి-భీమవరం రోడ్డు మార్జిన్‌లో వున్న ఆక్రమణలు తొలగించారు. ఈ మార్గం వెంబడి ఉన్న పంట కాల్వలో రొయ్యల వ్యర్థాలు వేయడంతో కలుషితమైన తాగునీరు దుంపగడప మంచినీటి చెరువుకు వెళుతున్నాయి. ఆ నీటినే దుంపగడప ప్రజలు తాగుతుండడంతో విషజ్వరాల బారిన పడుతూ అస్వస్థతకు గురవుతుండడమే కాకుండా ఓ విద్యార్థిని మరణించింది. ఈ విషయం ఎమ్మెల్యే రఘురామ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఆక్రమణదారులకు తాళ్ళకోడులో కేటాయించిన ఇళ్ల స్థలాల్లోకి వెళ్లాలని ఆదేశించారు. ఆక్రమణదారులు గడువు కావాలంటూ సీపీఎం నేతలతో కలిసి మంగళవారం ఆందోళన చేశారు. ఆక్రమణలు తొలగిస్తుండగా సీపీఎం నేతలు, ఆక్రమణదారులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. బుధవారం ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తరలివెళ్ళారు. సీపీఎం నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం సమక్షంలో ఎక్స్‌కవేటర్ల సాయంతో ఆక్రమణలు తొలగించారు. రెవెన్యూ, నగర పంచాయతీ, అగ్నిమాపకశాఖ, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం : సీపీఎం

పోలీసులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి దిక్కుతోచని పరిస్థితిలో ఆక్రమణదారులను ఖాళీ చేయించారని సీపీఎం పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం నేతలను హౌస్ అరెస్టులు చేయడం దుర్మార్గమని బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. స్థానిక ఎమ్మెల్యే పెత్తందారులు, బడాబాబుల కోసం పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం అన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సందక సూరిబాబు, గేదెల లావణ్య, ధనుష్, బి.కళ్యాణి, దొడ్డి పద్మ, పంపన కృష్ణవేణి, బి.అప్పలనాయుడు, జి.పద్మనాభం, బి.లక్ష్మణరావు, ఉమా, పి.శ్రీను తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కూటమి కార్యాలయాలు ప్రారంభం


కూటమి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

వీరవాసరం, (భీమవరం టౌన్), ఆగస్టు 28 : గత వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు విమర్శించారు. వీరవాసరం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు యరకరాజు సత్య హరిహరరాజు, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు డి..నాగశివ ఆధ్వర్యంలో గవరపాలెం, కొణితివాడ గ్రామాల్లో నిర్మించిన జనసేన పార్టీ జెండా స్థూపం, ఎన్డీఏ కూటమి కార్యాలయాలను ఉమ్మడి పశ్చిమ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్‌నాయుడు, జనసేన జిల్లా కార్యదర్శి చెనమల చంద్రశేఖర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణంలోని బుధవారం మార్కెట్లో వున్న శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధునికీకరణ పనులను ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ప్రారంభించారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, కమిటీ అధ్యక్షుడు పైపూరి బుజ్జిబాబు, కార్యదర్శి నేరెళ్ల కోటేశ్వరరావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

భీమవరం టౌన్, ఆగస్టు 28 : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు జి.జేమ్స్ కోరారు. బుధవారం ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఎం.మోహనరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌కంటాక్స్ మినహాయింపు రాష్ట్రమంతా ఒకేవిధంగా అమలు చేయాలని, ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టినతేదీ నమోదులో ఎదుర్కొంటున్న సమస్యను త్వరతగతిన పరిష్కరించే విధంగా ఎస్టీవోలకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. భీమవరం యూనిట్ అధ్యక్షుడు ఎస్.ఎస్.ఎస్.పాల్, ప్రధాన కార్యదర్శి పి.సీతారామరాజు, కోశాధికారి వి.వి.ఆర్.ఎస్. ఎస్.సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.

'పరిశ్రమల్లో భద్రత చర్యలు చేపట్టాలి'

భీమవరం అర్బన్, ఆగస్టు 28 : ఇటీవల కాలంలో పరిశ్రమల్లో ప్రమాదాలు పెరిగాయని, అరికట్టే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ విమర్శించారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఫ్యాక్టరీలో తనిఖీలు లేకుండా యాజమాన్యాలకు అనుకూలమైన చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు జరిగి వేలాది మంది కార్మికులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిశ్రమల్లో భద్రత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆందోళన చేపడతామన్నారు. సీఐటీయూ నాయకులు వాసుదేవరావు, డి.కళ్యాణి, కర్రి నాగేశ్వరరావు, సిరవరపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణ సరికాదు : జేఏసీ నాయకులు

ఆకివీడు, ఆగస్టు 28 : ఎస్సీలను విభజించి పాలించడం సరికాదని జేఏసీ రాష్ట్ర నాయకులు కోన జోషఫ్, చీకట్ల మంగరాజు, కటికతల రాజారావు అన్నారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సెంటర్‌లో వున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ పునఃపరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈది రవికుమార్, జి.ధనరాజు, మీసాలు జయరాజు, చిట్టిబాబు, గాలి సామ్రాజ్యం, విజయ్, ఎర్రిచర్ల గ్లాడ్సన్, జంగం సుధాకర్, కటికతల సువర్ణరాజు, పాగల్లు రాజు, రంజిత్, తాతల సందీప్, ప్రమీల, రాజు, అనిత, సత్యవేణి, పోడదాసి జైపాల్, క్రాంతిచరణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి దుర్గలహరి కుటుంబానికి న్యాయం చేయాలి

ఆకివీడు, ఆగస్టు 28 : విద్యార్థి విడమోలు దుర్గలహరి మృతిపై విచారణ చేసి కుటుంబానికి న్యాయం చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్వీ గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం భీమవరంలోని అడిషినల్ జిల్లా వైద్యాధికారి భానూనాయక్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. దుంపగడప బాలిక స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో చేరితే ఇంజక్షన్లు, రక్త పరీక్షలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే బాలిక చనిపోయిందన్నారు. పెంకి అప్పారావు, ముప్పా శ్రీను, నిడుమోలు మంగరాజు, ముప్పా చిన్న శ్రీనివాసరావు, నిడుమోలు నూకరాజు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

పాలకొల్లుఅర్బన్, ఆగస్టు 28 :నరసాపురం డివిజన్ పరిధిలో ఇంటి నిర్మాణాలు చేసుకునే లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని నరసాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీవీ రమణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. డివిజన్ పరిధిలో పలు దశల్లో 845 ఇళ్లు ఉన్నాయని ఇవి సెప్టెంబరు నెలాఖరుకు పూర్తి చేసుకోవాలని, ఎల్ఎల్, ఆర్ఎల్ స్టేజ్‌లో 2,143 ఉన్నాయని, వాటిని డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేసుకోవాలని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కవుల రచనలు యుగాంతం వరకు నిలుస్తాయి


టీచర్లను సత్కరించిన విజ్ఞానవేదిక నిర్వాహకులు

భీమవరం టౌన్, ఆగస్టు 28 : తెలుగు కవుల రచనలు, గ్రంథాలు చరిత్రలో యుగాంతం వరకు నిలుస్తాయని, మనదేశంలో ఎన్ని భాషాలున్నా తెలుగు భాషకు చాటిరావని శ్రీకృష్ణదేవరాయులు అన్నారని మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తెలుగుభాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా మునిసిపల్ కార్యాలయంలో తెలుగు భాష ఔన్నత్యంపై సదస్సు, తెలుగు రచయితలు, తెలుగు ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడు తూ అమెరికా వంటి అగ్రరాజ్యల్లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం మన తెలుగు జాతికే గర్వకారణమని అన్నారు. పట్టణంలోని 26మంది కళాశాల, ప్రాథ మిక పాఠశాలలోని రచయితలను, తెలుగు ఉపాధ్యాయులను సత్కరించి ప్రశంసా పత్రాలను అందించామన్నారు. వడ్డీ సుబ్బారావు, కలిగొట్ల గోపాలశర్మ, డాక్టర్ గాదిరాజు రంగరాజు, నాచు శ్రీవల్లి, అనసూయ, ఎ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'నాలుగు లక్షల బీజేపీ సభ్యత్వాలు లక్ష్యం'

ఉండి, ఆగస్టు 28: జిల్లాలో నాలుగు లక్షల బీజేపీ సభ్యత్వాలు నమోదు చేయాలనేది లక్ష్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లూరి సాయిదుర్గరాజు, సభ్యత్వ నమోదు ప్రముఖ్ కురెళ్ల నరసింహారావు అన్నారు. బుధవారం ఉండి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అసెంబ్లీ కో-కన్వీనర్ గాదిరాజు వెంకటేశ్వ రరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబరు ఒకటి నుంచి 25 వరకు మొదటి విడత సభ్యత్వ నమోదు, రెండో దఫా అక్టోబరు ఒకటి నుంచి 15 వరకు చేపడతామన్నారు. నియోజకవర్గంలో గతంలో 50 వేల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. మండల ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్, కొమ్మన నాగబాబు, పతివాడ అర్జునరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి, లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల అందజేత

పెనుమంట్ర, ఆగస్టు 28 : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెనుమంట్ర శాఖ, నరసాపురం ఆర్టీసీ డిపో వారి సౌజన్యంతో దివ్యాంగులకు బుధవారం ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి, మానవత అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి బస్సు పాసుల శిబిరాన్ని ప్రారంభించారు. మార్టేరు పరిసర ప్రాంతాల నుంచి 70 మంది దివ్యాంగులకు పాస్‌లు అందించారు. శిబిరంలో కార్యదర్శి శ్రీనివాసుల మురళీకృష్ణ, కోశాధికారి చదువుల నరేంద్ర, రీజనల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు అమృతవాక్కుల సత్యనారాయణ, నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ

భీమవరం క్రైం, ఆగస్టు 28 :యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రెండో పట్టణ సీఐ కాళీచరణ్ అన్నారు. బుధవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పోలీస్ డిపార్ట్‌మెంట్ సహకారంతో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని, హింసాత్మక ధోరణలు పెరుగుతాయని, వ్యక్తి శారీరకంగా మానసికంగా బలహీనంగా ఉంటారని, మాదక ద్రవ్యాలకు నేటి యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతీ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ గాదిరాజు రంగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక చవితి మహోత్సవాలకు శ్రీకారం

ఆకివీడు, ఆగస్టు 28 :వినాయక చవితి మహోత్సవాలకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శ్రీలక్ష్మీ గణపతి పండ్ల పూల వర్తక సంఘం ఆధ్వర్యంలో పందిరి రాట నిర్వహించారు. సాలిపేట, పెద్దింట్లమ్మ వీధిలో రాటలు వేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

భీమవరం క్రైం, ఆగస్టు 28 : భీమవరం పట్టణంలోని 24వ వార్డుకు చెందిన యువకుడు కనిపించడం లేదంటూ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని భీమవరం వన్‌టౌన్ ఏఎస్ఐ ఎం.రామకృష్ణ బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన ఎస్.వెంకట సత్యనారాయణ స్థానికంగా ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. ఈనెల 24న షాపునకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

ఉండి, ఆగస్టు 28: భార్య కనిపించడం లేదని భర్త శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. గణపవరం మండలం జగన్నాథపురానికి చెందిన పొలికి మాధవి ప్రతిరోజూ ఉండి మండలం వాండ్రంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వస్తుంది. బుధవారం ఉదయం ఫ్యాక్టరీకి విచ్చేసిన ఆమె రాత్రివరకు కనిపించలేదని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మంత్రి నిమ్మల చొరవతో తీరిన విద్యుత్ సమస్య


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన కూటమి నాయకులు

పాలకొల్లు రూరల్, ఆగస్టు 28 : గవరపేట గ్రామస్థులకు సుదీర్ఘకాలంగా వున్న విద్యుత్ సమస్యను మంత్రి నిమ్మల రామానాయుడు చొరవతో తీరింది. గ్రామంలో 63 కేవీ ట్రాన్స్‌పార్మర్‌ను బుధవారం గ్రామంలోని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు ప్రారంభించి మాట్లాడారు. గ్రామ ప్రజలకు అవసరమైన సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ లేకపోవడంతో తరచూ లో-వోల్టేజీ సమస్య ఏర్పడేదని, కనీసం ఫ్యాన్‌లు కూడా తిరిగేవి కావని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడతో మంత్రి నిమ్మల దృష్టికి తీసుకువెళ్ళడంతో వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ డి.బుల్లప్పారావు, లైన్‌మన్ నోబుల్‌రాజు, ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే అజహరుద్దీన్, గ్రామస్థులు యల్లపు అప్పారావు, లోకేశ్వరరావు, వెంకటసత్యనారాయణ, దొడ్డా. ధనలక్ష్మి, దాడి వీరబాబు, ఎస్. ఆదినారాయణ, శ్రీనివాసరావు, ఎంవీ రమణ, పి.భాను పాల్గొన్నారు.

ముంపు పొలాల్లో శాస్త్రవేత్తల పర్యటన


రామన్నపాలెంలో రైతులతో మాట్లాడుతన్న శాస్త్రవేత్తలు

నరసాపురం రూరల్/మొగల్తూరు, ఆగస్టు 28: నరసాపురం మండలంలోని పలు గ్రామాలు, మొగల్తూరు మండలం రామన్నపాలెంలో నాట్లు, ముంపు పొలాలను ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, డాక్టర్ పి.విజయలక్ష్మి మాట్లాడుతూ ముంపునకు గురైన పంట పొలాల్లో నీటిని తీసివేసి ఎకరానికి 20 కేజీల చొప్పున యూరియా, 20 కేజీల చొప్పున మ్యూరేట్‌ఆఫ్ పొటాష్ కలిపి చల్లాలన్నారు. ఒక లీటర్ నీటిలో ఒకగ్రాము కార్బెండజిల్ లేదా మాంకోజేబ్ కలిపి పిచికారీ చేయాలని సూచిం చారు. ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జి ఎ.రాజ్‌గోపాల్, రైతులు యాతం పాండురంగారావు, దాసరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నరసాపురం డీఎస్పీగా మురళీకృష్ణ బాధ్యతలు


మురళీకృష్ణ

నరసాపురం, ఆగస్టు 28: నరసాపురం డీఎస్పీగా ఎన్‌బీకే మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం బెటాలియన్‌లో పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. గతంలో ఉమ్మడి పశ్చిమలో ఎస్ఐగా జిల్లాలోని పెంటపాడులో పని చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన డీఎస్పీ శ్రీనివాస్ బదిలీపై విజయవాడ వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన డీఎస్పీని సబ్‌డివిజన్ పరిధి లోని సీఐలు, ఎస్ఐలు మార్యదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మొగల్తూరు, ఆగస్టు 28 : జ్వరాలు రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీహెచ్ఏ మూర్తి సూచించారు. బుధవారం మొగల్తూరు గ్రామంలోని గోడావారిపాలెంలో ఇళ్ల పరిసరాలను ఆయన పరిశీలించి చెత్తా చెదారాలను ఎత్తివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నియంత్రణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం లక్షణాలు ఉంటే ప్రభుత్వాసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. సీహెచ్‌వో విజయలక్ష్మి, ఏఎన్ఎం స్వరూపరాణి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మార్కాపురం డీసీసీబీ మేనేజర్ మృతి బాధాకరం

భీమవరం టౌన్, ఆగస్టు 28 : సహకార సంఘాల కంప్యూటరీకరణకు నెలరోజులుగా తీవ్ర ఒత్తిడితో పనిచేస్తూ మార్కాపురం డీసీసీ బ్యాంకు మేనేజర్ తుంపటి శ్రీనివాస్ గుండెపోటుతో మరణించడం బాధాకరమని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని సహకార సంఘ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.నందమూరి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సహకార సంఘ ఉద్యోగులను, డీసీసీ బ్యాంకు ఉద్యోగులపై ప్రతిరోజు టెలీకాన్ఫరెన్స్‌తో తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. మృతి చెందిన మేనేజర్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు పరిహారమిచ్చి, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

ఆక్వా సాగులో మేలైన పద్ధతులపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్

ఉండి, ఆగస్టు 28: ఆక్వా సాగులో మేలైన పద్ధతులపై రైతులంతా ప్రత్యేక దృష్టిపెట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఉండి కేవీకేలో ఆక్వాసాగులో మేలైన పద్ధతులపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆక్వాసాగులో నాణ్యమైన సీడ్ ఎంతో ప్రధానమన్నారు. శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలతో ముందుకు వెళ్తే మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఎంపెడా ఏడీ సీహెచ్ ఆనంద్, ఎఫ్‌డీవో సీహెచ్ రాంబాబు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్ ప్రకాశ్, రాజేష్, భారతి, కె.రాజేష్, రైతులు కందుల రాధాబల రామకృష్ణ యాదవ్, పీఆర్‌కే ఆంజనేయరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకాయలతిప్పలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'


మొగల్తూరు, ఆగస్టు 28 : మొగల్తూరు పంచాయతీ మూడో సచివాలయ పరిధి కొత్తకాయలతిప్పలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శిబిరంలో మొగల్తూరు ఆసుపత్రి డాక్టర్ దినేష్ 176 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 26 మందికి షుగర్, 32 మందికి బీపీ ఉన్నట్టు గుర్తించారు. గర్భిణుల ఇంటికి వెళ్ళి పరీక్షించి మందులు అందించారు. ఆసుపత్రి సిబ్బంది దేవిశ్రీ, సావిత్రి, కె.సాంబశివరావు, సునీత, సంపత్, ఆశా వర్కర్లు జ్యోతి, విజయలక్ష్మీ దేవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ


సిద్ధాంతంలో విఘ్నేశ్వర స్వామి వారి ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ దృశ్యం

పెనుగొండ, ఆగస్టు 28 : సిద్ధాంతంలో పురాతన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు, భక్తజనులచే ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం భారీ క్రేన్ సాయంతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద యంత్రం, వెండి ధ్వజస్తంభ ప్రతిష్ఠ జీవన్యాసములు, మహా పూర్ణాహుతి కుంభాభిషేకాలు గోదృష్టి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయంపై నుంచి బూరెలు పోసేందుకు పోటీ పడ్డారు. అనంతరం స్వామికి లక్ష గరిక పూజ నిర్వహించారు.


ప్రతిష్ఠించిన సీతా కోదండరాముడు, లక్ష్మణ, తదితర విగ్రహాలు

- పాలకొల్లు అర్బన్ : స్థానిక చిత్రాయి చెరువు గట్టు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సాయి గాయత్రి ఆలయంలో బుధవారం పలు దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి నాగులకొండ గోపి సత్యనారాయణ, శాంతిరత్న దంపతులు ఈ ఆలయాన్ని నిర్మించారు. గాయత్రి దేవి, విశ్వకర్మ, పరమేశ్వర, గణపతి, కోదండ రామ, రాధాకృష్ణ, షిరిడి సాయి, సత్యసాయి బాబా విగ్రహాలను ఆగమశాస్త్రాను సారం ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా ఏకాహ్నిక దీక్షను గోపి సత్యనారాయణ దంపతులు పాటించారు. అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. విగ్రహాల దాతలు, భక్తులు పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా తాడేపల్లిగూడెం శ్రీకృష్ణ ధ్యాన మందిరంలో బుధవారం దత్తాత్రేయ హోమం, సుదర్శన హోమం ఘనంగా జరిగాయి. మర్ల సూర్యనారాయణ బ్రహ్మత్వంలో గణపతి పూజ, నవగ్రహ మండపారాధన నిర్వహించారు.
- భీమవరంటౌన్ : పట్టణంలోని బంగ్రోతుల వారి వీధిలో వున్న వేణుగోపాల స్వామి మందిరంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం సుమారు వెయ్యి మందికి అన్నసమారాధన నిర్వహించారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్‌చే చామంతి పూలతో స్వామికి పూజ చేసి అలంకరణ చేశారు.
- కాళ్ళ : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా బొండాడ గ్రామంలో రాధాకృష్ణ యువజన కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాధాకృష్ణులకు బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో పలురకాల విచిత్ర వేషధారణలు, కేరళ సంప్రదాయాలు, డప్పులు, తీన్మార్ వాయిద్యాల మధ్య స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం అన్నసమారాధన నిర్వహిస్తామని యువజన కమిటీ సభ్యులు తెలిపారు.
- ఉండి : ఉండి కొత్తపేటలో వున్న శ్రీకృష్ణచైతన్య ఆశ్రమంలో శ్రీరాధామదన స్వామి వారి రథయాత్ర ఊరేగింపు బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు వున్న రథాన్ని భక్తులు, మహిళలు ఊరేగింపుగా తోడుకుని వెళ్లారు.